న్యూస్ బాక్స్

10 నుంచి సమ్మె సైరన్

జగిత్యాల అర్బన్, డిసెంబర్ 6 (ఆంధ్రజ్యోతి)ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సమగ్ర శిక్షా ఉద్యోగులు సమ్మె సైరన్ మోగించారు. గురువారం ఆ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు దుండిగల్ యాదగిరితో కలిసి ఉద్యోగులు ప్రభుత్వ ప్రదాన క్యాధర్శికి కలిసి సమ్మె నోటీసు అందించారు. తమ సమస్యల పరిష్కారానికి అధకారంలోకి రాక ముందు ముఖ్యమంత్రి ఇచ్చిన హమీ అమలు చేయక పోవ డంతో సమ్మెకు దిగాల్సి వస్తుందని, తమ సమ్మెకు టీఎస్‌యుటీఎఫ్ ఉద్యోగులు పూర్తి మద్దతు తెలుపుతున్నట్టు సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు తెలిపారు.

ఈవీఎం గోదాంను తనిఖీ చేసిన కలెక్టర్

జగిత్యాల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్‌ఆర్‌ఎస్‌పీ క్యాంపు సమీపంలో గల ఈవీఎం గోదాంను శుక్రవా రం కలెక్టర్ సత్య ప్రసాద్ తనిఖీ చేశారు. రాష్ట్ర ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఈవీఎం, వీవీప్యాడ్ గోదాంను సందర్శించి పరిశీలన జరిపారు. గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీ నాయకు లతో కలిసి పరిశీలన జరిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బీఎస్ లత, పలువురు రెవెన్యూ అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆదర్శ రైతుల వ్యవస్థ పునరుద్ధరణకు

కసరత్తులు



- 2017లో రద్దు అయిన వ్యవస్థ
- మళ్లీ తీసుకొస్తామని కాంగ్రెస్ సర్కారు ప్రకటన
- విధివిధానాల రూపకల్పనలో సర్కారు
- ఏఈవోలకు తగ్గనున్న పనిభారం..
- జిల్లా వ్యాప్తంగా 355 మంది నియామకమయ్యే అవకాశం

జగిత్యాల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గతంలో రద్దయిన ఆదర్శ రైతు వ్యవస్థను పునరుద్ధరించడానికి కసరత్తులు జరుగుతున్నాయి. ఆదర్శ రైతులను మళ్లీ కొనసాగించాలని సర్కారు యోచిస్తోంది. ఉమ్మడి రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా వ్యవహరించిన సమయంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి అమలు చేసిన ఆదర్శ రైతు వ్యవస్థను బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రద్దు చేసింది. గతంలో రైతులకు పంటల సాగులో సలహాలు, సూచనలు చేస్తూ అధిక దిగుబడి సాధిం చేలా ఆదర్శ రైతులు సాయపడేవారు. వ్యవసాయ శాఖకు, రైతు లకు అనుసంధానంగా ఉండేవారు. సాగుపై మంచి పట్టున్న వీరు పొలాల వద్దకు వెళ్లి రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చే వారు. గతంలో అమలైన ఈ పథకాన్ని మళ్లీ పునరుద్ధరించా లని కాంగ్రెస్ యోచిస్తోంది. తిరిగి దీన్ని తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నట్లు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇటీవల వెల్లడించడం గమనార్హం. ఇందులో భాగంగా ఆదర్శ రైతు వ్యవస్థను తిరిగి పునరుద్ధరించే కార్యక్రమానికి రాష్ట్ర ప్రభు త్వం తొలి అడుగువే సింది. రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ ఇటీవల జరిపిన తొలి సమావేశంలో చేసిన ప్రతిపాదనను కమిషన్ కమిటీ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు అందజేసింది. రెవెన్యూ గ్రామాన్ని ప్రాతిపదికగా తీసుకుంటూ వెయ్యి ఎకరాలకు ఒక ఆదర్శ రైతు ఉండే విష యాన్ని ప్రతిపాదనలో స్పష్టంగా తెలిపింది.

క్లస్టర్‌కు ఐదుగురి చొప్పున...

వెయ్యి ఎకరాలకు ఒక ఆదర్శ రైతును నియమించాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రస్తుతం 5 వేల ఎకరాలను ఒక క్లస్టర్‌గా విభజించారు. దీని పరిధిలో రైతు వేదికను ఏర్పాటు చేయగా ఏఈవోలను నియమించారు. ఈ లెక్కన ప్రతి క్లస్టర్‌కు ఐదు నుంచి ఆదర్శ రైతులు నియమి తులయ్యే అవకాశం ఉంది. జిల్లాలో మొత్తం 71 వ్యవసాయ క్లస్టర్లు ఉన్నాయి. ఐదుగురి చొప్పున సుమారు 355 మందికి ఈ జాబితాలో చోటు దక్కనుంది.

ఏఈవోలకు తగ్గనున్న పనిభారం....

ఇటీవల కాలంలో ఏఈవోలకు పనిభారం పెరిగింది. గతంతో పోలిస్తే వారి సంఖ్య పెరిగినా వారికి ఇప్పటికే ఉన్న కార్యకలా పాలతో పాటు అదనపు పనులు అప్పగించారు. సంక్షేమ పథకాల అమలుకు అవసరమైన చర్యలు

మిగతా 8వ పేజీలో

'పది'లో వంద శాతం ఫలితాలు సాధిస్తాం

జిల్లా విద్యాశాఖాధికారి కె రాము — ఇంటర్వ్యూ



జగిత్యాల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): క్షేత్ర స్థాయిలో విద్యా వ్యవస్థను బలోపేతం చేసి విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన కృషి చేస్తున్నామని, రానున్న పదో తరగతి పరీక్ష ఫలితాల్లో వంద శాతం ఫలితాల సాధించి రాష్ట్రంలోనే జగిత్యాల జిల్లాను ప్రథమ స్థానంలో నిలబెట్టడానికి నిరంతరం ప్రయత్నిస్తున్నామని జగిత్యాల జిల్లా విద్యాశాఖాధికారి కె రాము అన్నారు. విద్యాశాఖ పరంగా చేపడుతున్న కార్యక్రమాలు, విద్యార్థులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలను ఆయన 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో వివరించారు.

ఆంధ్రజ్యోతి: గతంలో పదో తరగతి పరీక్ష ఫలితాల్లో జగిత్యాల జిల్లా ప్రథమ స్థానంలో ఉండేది.. కొన్నేళ్లుగా వెనుకబడుతుందన్న ఆరోపణలున్నాయి..పురోగతికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..?

డీఈవో: రానున్న పదో తరగతి పరీక్షలను విద్యార్థులు సక్రమంగా రాసి ఉత్తమమైన ఫలితాలను రాబట్టడానికి అవసరమైన కృషిని నిరంతరం చేస్తున్నాము. నూటికి నూరు శాతం ఫలితాలు సాధిస్తామన్న విశ్వాసం ఉంది. ఇందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్తున్నాము.

ఆంధ్రజ్యోతి: పలు సబ్జెక్టుల్లో వెనుకబడిన పదో తరగతి విద్యార్థుల పట్ల ఎలాం టి ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారు..?

డీఈవో: పాఠశాల స్థాయిలో ఆయా సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులను ఇప్పటికే గుర్తించాము. కానీ ఆ విషయాన్ని విద్యార్థులకు తెలియజేయకుండా జాగ్రత్త పడుతున్నాము. విద్యార్థుల నైపుణ్యాలకు అనుగుణంగా ఏ,బీ,సీ,డీ గ్రేడులుగా విభజించాము. ప్రస్తుతం ప్రతీ రోజు ఒక్క పూట అదనపు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నాము. జనవరి నుంచి ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులను నిర్వహించి వెనుకబడిన విద్యార్థులు సత్ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకుంటున్నాము.

ఆంధ్రజ్యోతి: జిల్లాలోని పలు గురుకులాలు, మోడల్ స్కూల్స్ కేజీబీవీలలో ప్రస్తుత కాలంలో విద్యార్థులు చన్నీటి స్నానాలు చేస్తున్నారని అంటున్నారు..మీ దృష్టికి వచ్చిందా. పరిష్కారం ఎలా..?

డీఈవో: వేడి నీరు అందని పాఠశాలలను గుర్తించాము. సమస్యను కలెక్టర్ దృ ష్టికి తీసుకవెళ్లుతున్నాము. పలు పాఠశాలల్లో కలెక్టర్ మంజూరు చేస్తున్న ప్రత్యేక నిధులతో వేడి నీటిని విద్యార్థులకు అందిస్తున్నాము. ఎక్కడా కూడా సమస్య ఎదురుకాకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటున్నాము. ప్రత్యేకాధికారులను నియమించి నిరంతర పక్కా పర్యవేక్షణ జరుపుతున్నాము.

ఆంధ్రజ్యోతి: మధ్యాహ్న భోజన నిర్వహణలో పలు సమస్యలు తలెత్తుతున్నాయి కదా..పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..?

డీఈవో: జిల్లాలో మధ్యాహ్న భోజన నిర్వహణను పక్కాగా అమలు చేస్తున్నాము. విద్యార్థులకు నిబంధనల ప్రకారం మెనూతో కూడిన ఆహారాన్ని అందజేస్తున్నాము. భోజన ఏజన్సీలకు ఎప్పటికప్పుడు బిల్లులు మంజూరయ్యేలా ప్రయత్నిస్తున్నాము. నిర్లక్ష్యం వహిస్తున్న పాఠశాలల్లో బాధ్యులపై చర్యలు తీసుకుంటున్నాము.

డాటా ఎంట్రీ పకడ్బందీగా నిర్వహించాలి

- నిర్లక్ష్యం వహిస్తే చర్యలు
- కలెక్టర్ సత్యప్రసాద్
- అధికారులకు పలు సూచనలు

8



రాయికల్‌లో డాటాఎంట్రీని పరిశీలిస్తున్న కలెక్టర్

తాగుదామా.. రాగి జావ

మారుతున్న ఆహారపు అలవాట్లు

పెరుగుతున్న జావ

విక్రయ కేంద్రాలు

7



జగిత్యాలలో జావ తాగుతున్న వృద్ధుడు

శాస్త్ర సాంకేతిక రంగాల్లో అభివృద్ధి చెందాలి

ఎమ్మెల్సీ కూర రఘోత్తమ్ రెడ్డి



జ్యోతి ప్రజ్వళనతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ కూర రఘోత్తమ్ రెడ్డి

జగిత్యాల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): శాస్త్ర సాంకేతిక రంగాల్లో అభివృద్ధి చెందితేనే సుఖసంతోషాలతో ప్రజలు ఉంటారని ఎమ్మెల్సీ కూర రఘోత్తమ్ రెడ్డి, జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఓల్డ్ హైస్కూల్‌లో 52వ రాష్ట్రీయ బాల వైజ్ఞానిక ప్రదర్శన, 12వ ఇన్‌స్పైయిర్ అవార్డ్ మానక్ ప్రదర్శన కార్యక్రమాన్ని ఆమె జ్యోతి ప్రజ్వళన చేసి ప్రారంభించారు. రాష్ట్రీయ బాల వైజ్ఞానిక ప్రదర్శనా విభాగంలో ఏడు విషయాలకు సంబంధించి 214 ప్రదర్శనలు, ఇన్‌స్పైయిర్ మానక్‌కు సంబంధించి 65 ప్రదర్శనలు వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు తీసుకవచ్చారు. విద్యార్థులు సమాజానికి ఉపయోగపడే వ్యక్తులుగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి కె రాము, జిల్లా సైన్స్ అధికారి మచ్చ రాజశేఖర్, సూపర్ వైజర్ సురేందర్, జిల్లాలోని వివిధ మండలాల ఎంఈవోలు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

జగిత్యాలలో పోలీసులకు వెలమ సంక్షేమ సంఘం నేతల ఫిర్యాదు

జగిత్యాల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వెలమ సామాజిక వర్గాన్ని అసభ్య పదజాలంతో దూషిస్తూ, బెదిరింపులకు పాల్పడిన షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ పట్టణ సీఐ వేణుగోపాల్‌కు శుక్రవారం జగిత్యాల జిల్లా వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షుడు అయిల్నేని సాగర్‌రావుతో పాటు పలువురు నాయకులు ఫిర్యాదు చేశారు. పట్టణంలోని పోలీస్ సర్కిల్ కార్యాలయంలో సీఐ వేణుగోపాల్‌ను కలిసి ఫిర్యాదు పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షుడు అయిల్నేని సాగర్‌రావుతో పాటు పలువురు నాయకులు మాట్లాడారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రవర్తించిన తీరు అభ్యంతరకరంగా ఉందన్నారు. ఎమ్మెల్యే శంకర్ ప్రయోగించిన పదాలు, వాడిన భాషా వల్ల వెలమ సామాజిక వర్గం మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. అహంకార పూరితంగా ఒక సామాజిక వర్గంపై దూషనలు చేయడం, బెదిరింపులకు పాల్పడడం ఎంతవరకు సమంజసమన్నారు. ఎమ్మెల్యే శంకర్ చేసిన వ్యాఖ్యలపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశామన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు అయిల్నేని సాగర్‌రావు, దన్నమనేని వేణుగోపాల్ రావు, పురోషోత్తం రావు, నరేందర్, ఆనంద్‌రావు, ప్రసాద్, అనిల్, రవి, క్రిష్ణ, రవీందర్, అజీత్, రమేశ్, శ్రావణ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



సీఐ వేణుగోపాల్‌కు ఫిర్యాదు చేస్తున్న వెలమ సంక్షేమ మండలి నాయకులు

అంబేద్కర్.. సిద్ధాంతాలు ముందుకు తీసుకెళ్లాలి



అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కలెక్టర్, అధికారులు



కోరుట్లలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు

జగిత్యాల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భావనలు, సిద్ధాంతాలు ముందుకు తీసుకవెళ్లాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో అంబేద్కర్ 68వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లత, జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి రాజు కుమార్, కలెక్టరేట్ కార్యాలయ ఏవో హన్మంత్ రావు పాల్గొన్నారు.

●పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో గల వైద్య ఆరోగ్య శాఖ విభాగంలో శుక్రవారం అంబేద్కర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ చిత్ర పటానికి డీఎంహెచ్‌వో ప్రమోద్ కుమార్ పూలమాల వేసి నివాళుల అర్పించారు. ఈకార్యక్రమంలో పలువురు వైద్యాధికారులు, కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

అంబేద్కర్ అశయ సాధనకు కృషి చేయాలి

కోరుట్ల: అంబేద్కర్ అశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, కోరుట్ల మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని అంబేద్కర్ వర్ధంతిని బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించంగా విద్యాసాగర్‌రావు పాల్గొన్ని నివాళులు అర్పించారు. బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

●పట్టణంలోని మున్సిపల్, రెవెన్యూ అధికారులు, అంబేద్కర్ సంఘ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆర్డీవో జీవకర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య-అనిల్, వైస్ చైర్మన్ గడ్డమీది పవన్, కౌన్సిలర్ బలిజ పద్మ-రాజిరెడ్డి పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేశారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళ్లను అర్పించారు. మున్సిపల్ కమిషనర్ తిరుపతి, తహసీల్దార్ కిషన్ పాల్గొన్నారు.

ధర్మపురి: ధర్మపురి మండలంలో అంబేద్కర్ వర్ధంతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహ చౌరస్తా వద్ద, మున్సిపల్, ఏఎంసీ కార్యాలయాల్లో వేర్వేరుగా వేడుకలు నిర్వహించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, దళిత సంఘాల నేతలు, కార్యకర్తలు కలిసి పూల మాలలు వే సి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి ఏఎంసీ చైర్ పర్సన్ చిలుముల లావణ్య- ల క్ష్మణ్, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఇందారపు రామయ్య, కమిషనర్ శ్రీనివాస్, కార్యదర్శి భూమయ్య, అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షులు రాగుల కాంతయ్య, కౌన్సిలర్లు, ఏఎంసీ వైస్‌చైర్మన్ నర్సింహులు, లయన్స్ క్లబ్ పట్టణ వ్యవస్థాపక అధ్యక్షులు జక్కు రవీందర్ పాల్గొన్నారు.

పోసానిపేటలో సూరమ్మ భూసేకరణ గ్రామసభ



పోసానిపేటలో సమావేశంలో పాల్గొన్న అధికారులు

కథలాపూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పోసానిపేటలో శుక్రవారం సూరమ్మ చెరువుకు సంబంధించి ఎడమ కాలువలో భూములు కోల్పోతున్న రైతులతో రెవెన్యూ అధికారులు గ్రామ సభ నిర్వహించారు. ఈ గ్రామంలో 25 మంది రైతులకు చెందిన 20 ఎకరాల భూమి కాలువలో కోల్పోతున్నారు. రైతుల నుంచి ఎలాంటి అభ్యంతరాలు లేకపోవడంతో సభ సాఫీగా సాగింది. అయితే ఎకరానికి రూ. 20 లక్షలు నష్టపరిహారం అందేలా చూడాలని అధికారులకు రైతులు వినతి పత్రం అందించారు. ముగ్గురు రైతులకు సంబంధించి తప్పులు దొర్లడంతో సవరించనున్నట్టు అధికారులు తెలిపారు. కాగా ఈ నెల 7న దుంపెట, 9న తాండ్ర్యాల, 10 గంభీర్‌పూర్, 11 ఇప్పపల్లి, 12న పోతారం, 13 అంబారిపేట, 17న కలికోట, 18న చింతకుంట గ్రామాల్లో భూసేకరణ గ్రామ సభలు నిర్వహిస్తామని తహసీల్దార్ వినోద్ తెలిపారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌గౌడ్, ఆర్‌ఐ నగేశ్, రైతులు ఉన్నారు.

'ఏబీసీడీ వర్గీకరణకు అడ్డుపడితే సహించం'

కొడిమ్యాల, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) : ఏబీసీడీ వర్గీకరణకు అడ్డుపడుతె సహించేది లేదని మండల మాదిగ జేఏసీ నాయకులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద విలేకరులతో మాట్లాడుతూ ఏబీసీడీ వర్గీకరణ చేయాలని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిన తర్వాత వర్గీకరణ చేయటానికి నెలలుగా తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కాలయాపన చేస్తున్నాడని ఆరోపించారు. రిజర్వేషన్‌కు అనుకూలంగా వర్గీకరణ చేయటానికి కొంత మంది పెట్టుబడిదారులు అడ్డుకోవటం సరికాదన్నారు. మాల మాదిగలు కలిసి ఉండగా రాజకీయ లబ్ధి కోసం పెద్దపెల్లి ఎమ్మెల్యే వివేక్ విడగొట్టడానికి అనుచిత వ్యాఖ్యలు చేశాడన్నారు. ఈ సమావేశంలో మండల మాదిగ జేఏసీ నాయకులు పర్లపెల్లి ప్రసాద్, సురుగు శ్రీనివాస్, నర్సయ్య, రవి, మహేష్, స్వామి, ప్రభుదాస్, లక్ష్మన్ పాల్గొన్నారు.

నృసింహుడి సన్నిధిలో తొగుట పీఠాధిపతి పూజలు



స్తంభం వద్ద మాధవానంద సరస్వతి స్వామీజీ

ధర్మపురి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవాలయాన్ని తొగుట పీఠాధిపతి మాధవానంద సరస్వతి స్వామీ శుక్రవారం సందర్శించారు. ఆలయానికి వచ్చిన ఆయనకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం స్వామీజీ ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయం పక్షాన స్వామీజీకి శేష వస్త్రం, పండ్లు, ఫలాలు అందించారు. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ, ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, అర్చకులు నేరెళ్ల విజయ్, నవీన్, సిబ్బంది పాల్గొన్నారు



వేంకటేశ్వరస్వామి రథోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే సత్యం

వైభవంగా వేంకటేశ్వరస్వామి రథోత్సవం

కొడిమ్యాల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో బాగంగా మూడవ రోజు శుక్రవారం రాత్రి లక్ష్మీవేంకటేశ్వరస్వామి రథోత్సవం వైభ వంగా జరిగింది. ఈ రథోత్సవంలో చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం పాల్గొని స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ ఆద్వర్యంలో ఆలయ పరిసరాల నుంచి ప్రారంభమైన స్వామి వారి రథం గ్రామ నడిబొడ్డు అయిన అంగడి బజారు వరకు భక్తులు, ప్రజలు లాగారు. స్వామి వారి రథానికి మహిళలు మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు. ఆద్వర్యంలో పండితులు గ్రామస్తులు, భక్తులు రథం ముందు యువతీ యువకులు కోలాటాలతో, నృత్యాలు చేస్తూ రథోత్సవంలో పాల్గొన్నారు. మహిళలు రోడ్డు పొడుగునా గో వింద నామస్మరణతో అడుగడుగునా భక్తి శ్రద్ధలతో మంగళహారతులతో స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జీవన్‌రెడ్డి, కేంద్ర సహకార బ్యాంక్ మాజీ డైరెక్టర్ మల్లిఖార్జున్‌రెడ్డి, మండల కాంగ్రెస్ పాఋ్టీ అధ్యక్షుడు నారాయణగౌడ్ మాజీ సర్పంచు ప్రభాకర్ రెడ్డి, ఆలయ అర్చకుడు నాగరాజు రమేష్, కమిటీ సభ్యులు, గ్రామ ప్రముఖులు, భక్తులు వందలాదిగా పాల్గొన్నారు.

క్రైం కార్నర్

బస్సు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

గంగాధర, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గంగాధర ప్రధానరహదారిపై శుక్రవారం ఆర్టీసీబస్సు, ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మెట్‌పల్లి డిపోకు చెందిన బస్సు కరీంనగర్ వైపు వస్తుంది. రామడుగు మండలం వెదిర గ్రామానికి చెందిన భరత్ తన చెల్లి వివాహానికి హాజరైయ్యేందుకు జగిత్యాల వైపు వెళుతున్నాడు. గంగాధర మండలం మధురానగర్ వద్ద ప్రధాన రహదారిపై భరత్ ద్విచక్రవాహనాన్ని బస్సు ఢీ కొట్టింది. ఈ ఘటనలో భరత్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు భరత్‌ను కరీంనగర్ తరలించారు. దీనిపై ఎస్‌ఐ నరేందర్‌రెడ్డిని వివరణ కోరగా ప్రమాదంపై ఫిర్యాదు అందలేదని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి..

హుజూరాబాద్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలో శుక్రవారం బైక్ అదుపుతప్పి కింద పడిన ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చెంజర్ల గ్రామానికి చెందిన శివప్రసాద్ ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. పట్టణంలోని నటరాజ్ థియేటర్ సమీపంలో ప్రమాదవశాత్తు అదుపుతప్పి కింద పడ్డాడు. దీంతో శివప్రసాద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 వాహనంలో ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

అనారోగ్యంతో వృద్ధురాలు ఆత్మహత్య

గంగాధర, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గట్టుబూత్కూర్‌కు చెందిన ఓ వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై నరేందర్‌రెడ్డి తెలిపారు. పోలీసులు తెలిపి వివరాల ప్రకారం.. మండలంలోని గట్టుబూత్కూర్‌కు చెందిన గుండ లక్ష్మి(61) మూడేళ్లుగా నరాల వ్యాధితో బాధపడుతున్నది. చికిత్స తీసుకున్నా నయం కాలేదు. దీంతో మనస్తాపం చెంది శుక్రవారం గ్రామ సమీపంలోని మంచినీటి బావిలోకి దూకి ఆత్మహత్య చేసుకుంది. లక్ష్మి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

దొంగలించిన బైక్‌ను పట్టుకున్న పోలీసులు

శంకరపట్నం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి దొంగలించిన బైక్‌ను తీసుకెళ్తుండగా వాహనాల తనిఖీలో భాగంగా శుక్రవారం కేశవపట్నం పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. మండలంలోని మొలంగూర్ ఎక్స్ రోడ్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా గుండె శివప్రసాద్ అనే వ్యక్తి అనుమానా స్పదంగా బైక్(టీఎస్36జీ750)పై వెళుతున్నట్లు పోలీసులు గమనించారు. శివప్రసాద్‌ను విచారణ చేయగా శంకరపట్నం మండలంలోని గొల్లపల్లి గ్రామంలో బొగోతం రాకేష్ ఇంటి ఎదుట పార్కింగ్ చేసి ఉన్న బైక్‌ను బండారి రాజశేఖర్‌తో కలిసి దొంగలించినట్లు ఒప్పుకున్నాడు. ఏ1 బండారి రాజశేఖర్ పరారీలో ఉన్నాడని, ఏ2 శివప్రసాద్ వద్ద ఉన్న బైక్‌ను స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు. శివప్రసాద్‌ను అరెస్టు చేసి హుజూరాబాద్ కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్సై కొత్తపల్లి రవి తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

హుజూరాబాద్‌రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) : మండలంలోని శాలపల్లి ఇందిరానగర్ గ్రామం మీదుగా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను శుక్రవారం రాత్రి సీఐ తిరుమల్‌గౌడ్ పట్టుకున్నారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నందుకు గాను ట్రాక్టర్ సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

చిన్నకలువల ఎల్లమ్మ గుడిలో చోరీ

సుల్తానాబాద్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిన్నకలువల గ్రామంలోని ఎల్లమ్మ దేవాలయంలో చోరీ జరిగింది. శుక్రవారం ఉదయం దొంగతనం విషయం వెలుగుచూసింది. ఎల్లమ్మతల్లి మెడలో ఉన్న బంగారు పుస్తెతో పాటు భక్తులు మొక్కులు చెల్లించుకున్న వెండి పడిగెను ఎత్తుకుపోయారని గౌడకులస్థులు తెలిపారు. శుక్రవారం ఉదయం పోలీసులు గుడికి వచ్చి పరిశీలించారు.

మల్యాలలో చోరీ


ఇంట్లో చిందర వందరగా పడేసిన వస్తువులు

చందుర్తి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్యాలకు చెందిన పల్లికొండ సత్తవ్వ ఇంట్లో చోరీ జరిగింది. సత్తవ్వ వారం రోజుల క్రితం ఇంటికి తాళంవేసి సిరిసిల్లలోని పెద్దకొడుకు ఇంటికి వెళ్లింది. శుక్రవారం ఇంటికి తిరిగి వచ్చేసరికి తలుపుల తాళం పగలగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తాళం పగలగొట్టి లక్ష రూపాయలతోపాటు తులం బంగారం చోరీకి గురైనట్లు గుర్తిం చింది. ఈ సంఘటనపై విచారణ జరుపుతున్నట్లు హెడ్ కానిస్టేబుల్ శంకర్ తెలిపారు.

అదనపు కట్నం కేసులో భర్తకు ఏడాది జైలు శిక్ష

వేములవాడ టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : అదనపు కట్నం కోసం భార్యను వేధించిన భర్తకు ఏడాది జైలు శిక్షతోపాటు రూ.2వేల జరిమానా విధిస్తూ వేములవాడ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి జ్యోతి శుక్రవారం తీర్పు వెల్లడించినట్లు వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. బోయినపల్లి మండలం తడగొండకు చెందిన మహేందర్‌కు గంగాధర మండలం పిట్టలపల్లికి చెందిన మమతతో 2011లో వివాహమైంది. కొన్నేళ్ల తర్వాత మహేందర్ అదనపు కట్నం తీసుకురావాలని భార్యను వేధింపులకు గురిచేశాడు. వేధింపులు భరించలేక 2017లో బోయినపల్లి పోలీస్ స్టేషన్లో మహేందర్‌పై బాధితురాలు ఫిర్యాదు చేసింది. కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి నేరం రుజువు కావడంతో మహేందర్‌కు శిక్ష విధించినట్లు సీఐ పేర్కొన్నారు.

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య

కరీంనగర్ క్రైం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం ఎలగందుల గ్రామానికి చెందిన పత్తి భూమయ్య(54) అనే వ్యక్తి అనారోగ్యంతో శుక్రవారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కొత్తపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న భూమయ్య శుక్రవారం మధ్యాహ్నం గ్రామంలోని పాత ఇంటికి వెళ్లి తలుపులు బిగించుకుని ఇంటిలోని దూలానికి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు భూమయ్య కొడుకు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పోలీసుల విధులను ఆటంకపరిచిన ఇద్దరిపై కేసు

కరీంనగర్ క్రైం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): నగరంలోని గణేష్ నగర్‌లో గురువారం రాత్రి పోలీసు పెట్రోలింగ్ నిర్వహిస్తున్న ఏఎస్‌ఐ ఎండీ నజీమొద్దీన్, మరో కానిస్టేబుల్, హోంగార్డుల విధులను ఆటంకపరచి దుర్భాషలాడిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశామని ఒకటో ఠాణా పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం... గణేష్‌నగర్‌లో ఒక కారు పోలీసు సైరన్‌తో తిరుగుతున్నట్లు బ్లూ కోల్ట్స్ పోలీసులకు సమాచారం అందింది. అక్కడికి ఏఎస్‌ఐ బృందం వెళ్లి కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులను బ్రీత్‌ఎనలైజర్‌తో పరీక్షించేందుకు ప్రయత్నించారు. అందుకు వారు నిరాకరించటంతోపాటు దుర్భాషలాడారని, విధులను ఆటంకపరిచారని ఏఎస్‌ఐ ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు బానోతు రాజేందర్, మాలోతు శేఖర్‌పై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.


తోటలో నుంచి మార్కెట్‌కు కూరగాయలను తరలిస్తున్న రైతులు


బెండ కాయలు తెంపుతున్న రైతులు

కూరగాయల సాగుకు కేరాఫ్ బంజేరుపల్లి


మామిడి తోటలో అంతర్ పంటగా కాలిఫ్లవర్ వేసిన రైతులు

● ఏక కాలంలో రెండు పంటలతో అధిక లాభాలు పొందుతున్న రైతులు

ధర్మారం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మిగతా పంటల కంటే కూరగాయల సాగు కొంత కష్టంతో కూడుకున్నది. నిత్యం పురుగు, వైరస్ ఆశించి నష్టం కలిగిస్తాయి. అయినప్పటికీ పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలోని బంజేరుపల్లికి చెందిన రైతులు ఇష్టంతో కూరగాయలు పండిస్తున్నారు. అంతేకాకుండా ప్రతి సీజన్‌లోనూ ఏక కాలంలో రెండు రకాల పంటలు పండించేలా ప్లాన్ చేసుకుంటూ అధిక లాభాలు పొందుతున్నారు. గ్రామంలోని చాలా మంది రైతులు టమాట, అలసంద, చిక్కుడు, బీర, బెండ, వంకాయతో పాటు అధిక లాభాలు తెచ్చిపెట్టే కాలిఫ్లవర్‌ను అంతర పంటగా సాగు చేస్తున్నారు.


ఆయిల్‌పామ్ తోటలో అంతర్ పంటగా టమాట నారు

● అంతర్ పంటలతో అధిక లాభాలు..

కూరగాయల సాగులో బంజేరుపల్లి గ్రామరైతులు వినూత్న పద్ధతులను పాటిస్తున్నారు. ఏక కాలంలో రెండు పంటలు సాగు చేయడం అలవాటు చేసుకున్నారు. మామిడి, ఆయిల్‌పామ్ తోటలో అంతర్ పంటలుగా కాలీఫ్లవర్, టామట పండిస్తున్నారు. అలాగే తీగ జాతి పంటలైన బీర, చిక్కుడు పబ్బులను రెండు పంటలకు పనికి వచ్చేలా ఏర్పాటు చేస్తున్నారు. మొదట బీర నారు పెట్టి, 20 రోజుల తర్వాత అదే స్థానంలో చిక్కుడు నారు పెడుతారు. సాధరణంగా బీరకాయలు 2 నుంచి 4 నెలల వరకు కాస్తాయి. అవి పూర్తి అయ్యేలోపు చిక్కుడు కాయలు కాస్తాయి. ఇలా ఒకే స్థలంలో రెండు పంటలు తీస్తూ లాభాల సాధిస్తున్నారు.

● ఏక కాలంలో రెండు పంటలు..



గత 10 సంత్సరాలుగా కూరగాయలు సాగు చేస్తున్నాను. కష్టంతో కూడకున్న పంటలు అయినప్పటికీ ఇష్టంతో చేస్తున్నాను. ఒకే సమయమంలో రెండు పంటలు తీయడం నాకు అలవాటు. మామిడి, ఆయిల్‌పామ్ తోటల్లో అంతర్ పంటలుగా టమాట, కాలీఫ్లవర్ పండిస్తాను. అలాగే బీర, చిక్కుడు కాయలు ఒకదాని వెంట ఒకటి కాసేలా ప్లాన్ చేసుకుంటాను.

- గడ్డం ప్రభాకర్‌రెడ్డి

● ఐదు ఎకరాల్లో పండిస్తాం..



మేము ప్రతి సంవత్సరం 3 నుంచి 5 ఎకరాల్లో కూరగాయలు పండిస్తాం. నేను, నా భర్త కష్టపడి పనిచేస్తాం. బెండ, చిక్కుడు తెంపేటప్పుడు మాతో పాటు కైకిల్లోను పెట్టి తెంపుతాం. తోటల నుండి మేన్ రోడ్డ వరకు బండ్లపై కూరగాయలు తరలిస్తాము. అక్కడి నుండి బేరగాళ్లు వచ్చి తీసుకెళ్లారు. ఒక ఎకరానికి లక్ష వరకు సంపాదిస్తాం.

- గడ్డం జమున-మల్లారెడ్డి

లైన్ క్లియర్..

● రామగుండంలో వంద పడకల ఈఎస్‌ఐ ఆసుపత్రి
● 30వేల కుటుంబాలకు ప్రయోజనం...
● రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేసిన కేంద్రం

కోల్‌సిటీ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రామగుండంలో పెండింగ్‌లో పడ్డ 100పడకల ఈఎస్‌ఐ ఆసుపత్రి నిర్మాణానికి లైన్ క్లియర్ అయ్యింది. ఆసుపత్రి ఏర్పాటుకు ఆమోదం తెలుపుతూ కేంద్రం ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం ఇచ్చినట్టు రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పేర్కొన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్రానికి చేసిన విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారన్నారు. కేంద్రం గతంలో రామగుండానికి 100పడకల ఈఎస్‌ఐ ఆసుపత్రి మంజూరు చేసింది. అప్పటి ప్రభుత్వం స్థలం ఇవ్వకపోవడంతో ఆసుపత్రి ఏర్పాటు పెండింగ్‌లో పడింది. జాప్యం జరుగడంతో ఏర్పాటు ప్రక్రియ మూలన పడంది. రామగుండం పట్టణంలోని ఈఎస్‌ఐ డిస్పెన్సరీ స్థలంప్రాంగణంలోనే ఆసుపత్రి ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నారు. తాజాగా సవరించిన అంచనాలతో ఆసుపత్రి నిర్మాణం చేయనున్నారు. ఈ ఆసుపత్రి నిర్మాణం జరిగితే సూపర్ స్పెషాలిటీ వైద్యం ఈఎస్‌ఐ ఖాతాదారుల కుటుంబాలకు లభించనున్నాయి. ప్రస్తుతం ఈఎస్‌ఐ ఖాతాదారులు చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. రామగుండం ప్రాంతంలో సింగరేణి, ఎన్‌టీపీసీ, ఆర్‌ఎఫ్‌సీఎల్, మున్సిపల్ కార్పొరేషన్ ఇతర ప్రైవేట్ సంస్థలతో పాటు ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలోని సుమారు 30వేల మంది కార్మిక కుటుంబాలకు ప్రయోజనం చేకూరనున్నది. అన్నిరకాల వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. ప్రభుత్వం, ఈఎస్‌ఐ కార్పొరేషన్లు ఆసుపత్రి నిర్మాణం తరువాత మరిన్ని నిధులు మంజూరు చేసే అవకాశం ఉంది. త్వరలోనే నిధుల విడుదలకు సంబంధించి జీవో విడుదల కానున్నది.

● సీఎం విజ్ఞప్తి మేరకు నిర్ణయం...

రామగుండం ఈఎస్‌ఐ ఆసుపత్రి ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర ప్రభుతానికి విజ్ఞప్తి చేశారు. ఇటీవల ఢిల్లీ పర్యటనలో సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఆసుపత్రి నిర్మాణానికి అన్ని రకాల సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆసుపత్రి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం లైన్ క్లియర్ చేసింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మంత్రి, శ్రీధర్‌బాబుకు కృతజ్ఞతలు.

-ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

ఉయ్యాల ఉరితాడైంది..

● ఉయ్యాల మెడకు చుట్టుకుని బాలిక మృతి

మానకొండూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): శుభకార్యానికి వచ్చి ఇంట్లో ఉన్న చీరతో కట్టిన ఉయ్యాల ఊగుతూ అదే చీర మెడకు ఉరిపడి ఓ బాలిక మృతి చెందింది. కరీంనగర్‌లోని వావిలాలపల్లికి చెందిన సైరున్నీషా-ముజఫర్ దంపతులకు కుమార్తె ఆయేషా తబుస్సం (14). సైరున్నీషా తన స్వగ్రామమైన కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలంలోని లక్ష్మీపూర్‌లో తన తమ్ముడి వివాహం ఉండటంతో కుటుంబంతో కలసి గ్రామానికి వెళ్లింది. శుక్రవారం ఇంట్లో వారందరూ పనిలో ఉండగా రేకుల షెడ్డులో చీరతో కట్టిన ఉయ్యాలలో ఆయేషా తబుస్సం ఊగుతూ మెడకు చుట్టుకొని ఉరిపడింది. తల్లి రేకుల షెడ్డులోకి వచ్చి చూసే సరికి మెడకు ఉరిపడడాన్ని గమనించి కేకలు వేసింది. దీంతో కుటుంబ సభ్యులు ఆయేషాను 108 వాహనం ద్వారా చికిత్స నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే తబుస్సం మృతి చెందిందని తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు నిట్టూరు విద్యార్థుల ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పెద్దపల్లి రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో డిసెంబరు 1న కబడ్డీ అసోసియేషన్ ఉమెన్స్ కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిట్టూరు పాఠశాల నుంచి ముక్కెర సంధ్య, జంజిరా రూపప్రియ, అట్ల సంకీర్తన, బొంకూరి వెన్నెల పాల్గొని అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. హైదరబాద్ లాల్‌బహదూర్ స్టేడియంలో ఈనెల 7,8,9,10 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు పాఠశాల ప్రధానోపా ధ్యాయుడు లక్ష్మయ్య తెలిపారు. ఈసందర్భంగా ఎంపికైన విద్యార్థులకు పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీ కుంభాల సుధాకర్, పీఈటీ పాల్గొన్నారు.

గోదావరిఖనిలో 25క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత...

కోల్‌సిటీ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని నుండి మహా రాష్ట్రకు తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని గురువారం రాత్రి గోదావరిఖని గంగానగర్ వద్ద రామగుండం టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐరాజేష్ ఆధ్వర్యంలో నమ్మదగిన సమాచారం మేరకు గోదావరి వంతెన వద్ద తనిఖీ జరిపారు. గోదావరిఖని నుంచి టాటా ఏస్ వాహనంలో తరలిస్తున్న బియ్యాన్ని పట్టుకున్నారు. 25క్వింటాళ్ళ బియ్యం స్వాధీనం చేసుకుని డ్రైవర్ అంజనిని అదుపులోకి తీసుకున్నారు.

సుందిల్లలో..

ఫెర్టిలైజర్‌సిటీ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రామగిరి మండలం సుందిల్ల గ్రామ శివారులో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని శుక్రవారం గోదావరిఖని టూటౌన్ పోలీసులు పట్టుకు న్నారు. సుందిల్ల నుంచి గోదావరిఖని వైపు ఆటోలో తరలిస్తున్న రెండు క్వింటాళ్ళ పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. మంచిర్యాల జిల్లా కేంద్రానికి చెందిన చింతల రాకేష్ గ్రామాల్లో ప్రజల వద్ద తక్కువ ధరకు బియ్యాన్ని కొనుగోలు చేసి ఇతర ప్రాంతాలకు విక్రయించేందుకు తరలిస్తున్న క్రమంలో పట్టుబడినట్టు పోలీసులు తెలిపారు. ఆటోను అదుపులోకి తీసుకుని రాకేష్‌పై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

స్నేహితురాలి కోసం వెళ్లి.... ఆసుపత్రిలో తలదాచుకున్న విద్యార్థిని

● ట్రేస్ చేసి పట్టుకున్న పోలీసులు


నిజామాబాద్ పోలీస్ స్టేషన్‌లో విద్యార్థినితో సీఐ, పోలీస్ సిబ్బంది, బంధువులు

మెట్‌పల్లిటౌన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) : పాఠశాల నుంచి అదృశ్యమైన పదోతరగతి విద్యార్థినిని మెట్‌పల్లి పోలీసులు ట్రేస్ చేసి శుక్రవారం పట్టుకున్నారు. స్నేహి తురాలిని కలిసేందుకు వెళ్లి ఫోన్ నెంబర్ దొరకపోవడంతో ప్రభుత్వ ఆసుపత్రిలో తలదాచుకుంది. చివరకు విద్యార్థిని తనతాతకు ఫోన్ చేయడంతో ఆనంబర్ ఆధారంగా పోలీసులు ట్రేస్ చేసి విద్యార్థిని అక్షరను పట్టుకోవడంతో తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యం ఊపిరి పీల్చుకున్నారు. బాలిక అదృశ్యం పట్టణంలో కలకలం రేపడంతో మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి గురువారం నుంచి ముమ్మర చర్యలు చేపట్టారు. పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న అక్షర గురువారం మధ్యాహ్నం తన స్నేహితురాలిని కలిసేందుకు పాఠశాల నుంచి నేరుగా మెట్‌పల్లి బస్‌స్టాండ్‌లో నిజామా బాద్ బస్సు ఎక్కింది. నిజామాబాద్ బస్టాండ్‌లో దిగిన ఆనంతరం తన స్నేహితురాలి అడ్రస్ దొరకకపోవడంతో ఆక్కడే రాత్రి ఓ ఆసుపత్రిలో తలదాచుకుంది. శుక్రవారం ఉదయం తన తాతకు ఫోన్ చేసి స్నేహితురాలి నెంబర్ ఇవ్వాలని కోరింది. నెంబర్ దొరకకపోవడంతో ఇవ్వలేదు. అప్పటికే విద్యార్థిని కనిపించడం లేదని తెలియడంతో వెం టనే ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలిపి సంబంధిత నెంబర్ పోలీసులకు తె లుపడంతో సీఐ నిరంజన్‌రెడ్డి నెంబర్‌ను ట్రేస్ చేసి నిజామాబాద్‌లో ఉన్నట్లు గుర్తిం చారు. వెంటనే సీఐ నిజామాబాద్ ట్రాఫిక్ ఎస్‌ఐ సంజీవ్‌ను అప్రమత్తం చేసి బస్టాండ్‌లో బాలికను పట్టుకున్నట్లు సీఐ తెలిపారు. హుటాహుటిన మెట్‌పల్లి సీఐ, మ ల్లాపూర్ ఎస్‌ఐ కిరణ్‌కుమార్ నిజామాబాద్ వెళ్లి బాలికను తీసుకువచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

షాజాపూర్‌లో రాఘవపూర్ కళాకారుల ఒగ్గు డోలు ప్రదర్శన


మధ్య ప్రదేశ్‌లో ఒగ్గుడోలు ప్రదర్శిస్తున్న రాఘవపూర్ కళాకారులు

పెద్దపల్లి రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మధ్యప్రదేశ్ రాష్ట్రం షాజాపూర్‌లో గంగౌర్ ఉత్సవ్ పేరుతో ఈనెల 5న నిర్వహించిన వేడుకల్లో తెలంగాణ రాష్ట్రం నుంచి పెద్దపల్లి జిల్లా మండలం రాఘవపూర్ గ్రామానికి చెందిన ఓంకార్ ఒగ్గుడోలు కళాబృందం ఆధ్వర్యంలో ప్రదర్శన ఇచ్చారు. టీం లీడర్ కుంట సదయ్య, కుంట రాజ్‌కుమార్, కుంట సదయ్య, ఈరు రమేష్, జంగిలి పోచాలు, కుంట సిద్ధార్థతో పాటు 15 మంది కళాకారులు పాల్గొన్నారు.

మెకానికల్ విభాగమే కీలకం..

● ఆర్‌ఎఫ్‌సీఎల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ రమేష్ ఠాకూర్



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌ఎఫ్‌సీఎల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ రమేష్

రామగిరి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) : ఇంజనీరింగ్ విద్యలోని ప్రతి బ్రాంచ్‌ల్లో మెకానికల్ విభాగమే కీలకమని రామగుండం ఫర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ డిప్యూటీ జనరల్ మేనేజర్ రమేష్ ఠాకూర్ అన్నారు. జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం మెకానికల్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి అధ్యక్షతన అర్డోబోటిక్స్ రోబోటిక్స్‌పై రెండు రోజుల పాటు నిర్వహించే జాతీయస్థాయి వర్క్‌షాప్ ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రస్తుతం ఇంజనీరింగ్ విభాగంలో మెకానికల్‌కు ప్రాధాన్యత తగ్గినా విద్యార్థులు అధైర్య పడవద్దన్నారు. ప్రతి విభాగంలోనూ మెకానికల్ విభాగం ప్రాముఖ్యత, ప్రాధాన్యం ఉంటుందన్నారు. సివిల్, ఎలక్ట్రికల్, మైనింగ్ బ్రాంచ్‌లన్నీ మెకానికల్ బ్రాంచ్‌పై ఆధారపడినవేనని పేర్కొన్నారు. మెకానికల్ విద్యార్థు లకు ఉజ్వల భవిష్యత్తు ఉందన్నారు. మంథని జేఎన్టీయూ కళాశాలకు ఎలాంటి సహాయ సహకారాలైనా అందించడానికి ఆర్‌ఎఫ్‌సీఎల్ ముందు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనర్స్ సతీష్‌పడినాల్, శేఖర్ లాల్, ఫ్యాకల్టీ సలహాదారు పి. స్వప్న, స్టూడెంట్ కోఆర్డినేటర్స్ బి. లోకేష్, శ్రీనాథ్, లావణ్య, సంగీత, ఇతర కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.


9న ఉమ్మడి జిల్లా అండర్-14 క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా అండర్-14 క్రికెట్ జట్టు ఎంపిక పోటీలను ఈనెల 9న నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని కరీంనగర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్(కేడీసీఏ)నెట్స్‌లో ఉదయం 8 గంటల నుంచి ఈ పోటీలను నిర్వహించనున్నామని జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వి ఆగమ్‌రావు, ఎన్ మురళీధర్‌రావు, ఉపాధ్యక్షులు కె మహేందర్‌గౌడ్, పి మనోహర్‌రావు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తిగల క్రీడాకారులు తమ జనన ధ్రువీకరణ పత్రం, బోనఫైడ్, ఆధార్‌కార్డు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో హాజరుకావాలని కోరారు. క్రీడాకారులు సెప్టెంబరు 1, 2010 నుంచి ఆగస్టు 31, 2012 లోపు జన్మించిన వారు అర్హులని తెలిపారు. ఈ పోటీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు సెలెక్షన్ ఇన్‌చార్జి సీహెచ్ అజిత్‌రావు, బి శ్రావణ్‌కుమార్‌లను 8688768775 నంబరులో సంప్రదించాలని సభ్యులు సూచించారు.

రాష్ట్ర స్థాయి మానేటి లఘుచిత్ర పోటీల పోస్టర్ ఆవిష్కరణ

కరీంనగర్ కల్చరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని లఘు చిత్ర కళాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, కరీంనగర్ ఫిలిం సొసైటీ, తెలంగాణ లఘు చిత్ర నిర్మాతల మండలి సంయుక్తంగా రాష్ట్రస్థాయి మానేటి లఘు చిత్ర పోటీలను నిర్వహిస్తోంది. శుక్రవారం కరీంనగర్ ఫిలింభవన్‌లో పోటీల ప్రచార పోస్టర్‌ను నిర్మాతల మండలి అధ్యక్షుడు తంగెడ అశోక్‌రావు ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ షార్ట్ ఫిల్మ్ మేకర్స్‌కు ఈ పోటీలు మంచి అవకాశమని, దీంతో రాష్ట్రస్థాయి గుర్తింపు లభిస్తుందన్నారు. కరీంనగర్ ఫిలిం సొసైటీ ఉపాధ్యక్షుడు సయ్యద్ ముజాఫర్ మాట్లాడుతూ డిసెంబరు చివరి వారంలో పోటీలు జరుపుతామని, ఎంట్రీలు పంపడానికి చివరి తేదీ డిసెంబరు 15 అని అన్నారు. ఎంపికైన ఉత్తమ లఘు చిత్రానికి 20,000 నగదు, ద్వితీయ లఘు చిత్రానికి 10,000 నగదు, తృతీయ లఘు చిత్రానికి 5,000 నగదు, ఐదు ప్రోత్సాహక బహుమతుల కింద ఒక్కో చిత్రానికి 1000 రూపాయల చొప్పున అందిస్తామని తెలిపారు. డిసెంబరు చివరి వారంలో కరీంనగర్ ఫిలిం భవన్‌లో జరిగే విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాడిశెట్టి గోపాల్, కందల సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగుదామా..జావ



- మారుతున్న ఆహారపు అలవాట్లు
- పెరుగుతున్న జావ విక్రయ కేంద్రాలు

అన్నా చాయ్ తాగుదామా. ఇది అప్పుడు. అన్నా జావ తాగుదామా. ఇది ప్రస్తుతం ట్రెండ్..రుచికి రుచి ఆరోగ్యానికి ఆరోగ్యం అందుకే జనం జావ వైపు మళ్లుతున్నారు. కుప్పలు కుప్పలుగా చాయ్ విక్రయ కేంద్రాల్లా జావ విక్రయ కేంద్రాలు కూడా మెల్ల మెల్లగా ఊపందుకుంటున్నాయి. కరోనా తరువాత జనాల్లో వచ్చిన రకరకాల అనారోగ్య సమస్యలు ఎంతో కొంత మార్పులైతే తీసుకొచ్చింది. కాఫీ,టీలకు బదులు జావ తీసుకోవడం అలవాటు చేసుకుంటున్నారు. ఉదయాన్నే వ్యాయామం చేయడం ఆ తరువాత జావ తీసుకోవడం దినచర్యలో భాగమైపోయింది. రోజురోజుకూ జావ తీసుకునే వారి సంఖ్య పెరిగిపోవడంతో జావ సెంటర్లు కూడా క్రమ క్రమంగా పెరుగుతున్నాయి.

జగిత్యాల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలలోని పలు ప్రాంతాల్లో జనం జావ తోవ పడుతున్నారు. 'టీ' కి ప్రత్యామ్నాయంగా జావ తీసుకుంటున్నారు. ఆరోగ్యాన్ని రక్షించుకోవడానికి జనాల్లో ఆహారపు అలవాట్లు రోజు రోజుకూ మారుతున్నాయి. కరోనా సమాజానికి సరికొత్త ఆరోగ్య పాఠాలు నేర్పింది. వైద్యరంగానికి సంబంధించి అనేక విషయాలు తెలిపి పాటించేలా చేసింది. ఆహారపు అలవాట్లను మార్చింది. వ్యాయామ సాధనను పెంచింది. ఇలా అనేక రకాలుగా మార్పులు తెచ్చింది. అందుకే నిత్యం ఆరోగ్యానికి మేలుచేసే ఆహార కేంద్రాలు పుట్టుకొస్తూనే ఉన్నాయి. గతంలో ఉదయం లేవగానే చాలామంది టీ, కాపీ తోనే దినచర్య ప్రారంభించే వారు. కరోనా తరువాత గ్రీన్‌టీ, లేమన్ టీకి మారారు. ప్రస్తుతం మిల్లెట్ మాల్ట్, జావ ట్రెండ్ నడుస్తోంది. బరువు పెరగకుండా దీర్ఘకాలిక వ్యాధులు సోకకుండా జావ ఉపయోగపడుతుందని చాలా మంది దీనిపై ఆసక్తి చూపిస్తున్నారు. జగిత్యాల జిల్లాలోని పలు ప్రాంతాల్లో జావవ విక్రయ కేంద్రాలు అందుబాటులోకి రావడంతో స్థానికులు తాగేందుకు ఇష్టపడుతున్నారు.

'టీ'కి ప్రత్యామ్నాయంగా...

ఉదయం సాయంత్రం వ్యాయామం చేసిన అనంతరం సాధకులందరూ స్నేహితులు కలుసుకున్నా.. కాలక్షేపం చేయాలన్నా మొదటి వరకు టీ(చాయ్)కి ప్రాధాన్యం ఇచ్చేవారు. ఆయా కేంద్రాల్లో సరదగా గడుపుతుండేవారు. ఆతర్వాత లెమన్, గ్రీన్‌టీ కేంద్రాల బాట పట్టారు. ఇప్పుడు జిల్లా కేంద్రంతో పాటు కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్, ధర్మపురి తదితర ప్రాంతాల్లో నూత నంగా అందుబాటులోకి వచ్చిన జావ విక్రయకేంద్రాల వైపు చూస్తున్నారు. ప్రస్తుతం జగిత్యాల జిల్లా కేంద్రంలో ఈ కేంద్రాలకు గిరాకీ సైతం బాగానే ఉంది. ఉదయం 6గంటలకు మొదలైతే రాత్రి 9గంటల వరకు జావ కేంద్రం కొనసాగుతుండడం గమనార్హం.

ఇంట్లోనూ సిద్ధం చేసుకునేలా...

జావ తాగాలని కాకుండా సొంతంగానూ సిద్ధం చేసుకునేలా జావ డబ్బాలు విక్రయిస్తున్నారు. వేడి నీటిని కాచి సరిపడా పౌడర్‌ను కలిపేస్తే జావ తయారవుతుంది. ఈ జావ రుచి చూసిన పలువురు ఇష్టపడి కొనుగోలు చేస్తున్నారు. ఇంట్లోనే సిద్ధం చేసుకుంటున్నారని కేంద్రం నిర్వాహకులు చెబుతున్నారు.





జగిత్యాలలో జావ విక్రయకేంద్రాల వద్ద జనం

ఆరోగ్యంగా ఉండడానికే...



ఆరోగ్యంగా ఉండడానికి జావ తాగుతున్నారు. నూనెలో కాచిన పదార్థాలు, టీ, కాఫీ కంటే జావ కొంత ఆరోగ్యాన్ని ఇస్తుంది. ప్రస్తుత రోజుల్లో రకరకాల అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి. అందుకే చాలా మంది ఆరోగ్యంపై శ్రద్ధ పెడుతున్నారు. ఇందులో భాగంగానే జావ తాగడానికి ఇష్టపడుతున్నాను.

- రవి మెకానిక్, జగిత్యాల

ప్రతీ రోజు సాయంత్రం జావ తీసుకుంటా



కొంత కాలంగా ప్రతీ రోజు సాయంత్రం జావ తీసుకుంటున్నాను. జావ తాగడం వల్ల ఆరోగ్యం బాగుంటుంది. టీ, కాఫీల కన్నా ఎంతో శ్రేయస్కరం ఇది. ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవు. కడుపులో కూడా చాలా తేలికగా ఉంటుంది. రోజంగాఉల్లాసంగా, ఉత్సాహంగా అనిపిస్తోంది. అందుకే జావ తాగుతున్నాను.

- తిప్పబత్తుల లక్ష్మీనారాయణ, జగిత్యాల

రామగుండం ఎన్టీపీసీలో డైరెక్టర్ రవీంద్ర పర్యటన

- కోల్ భవన్, హెరిటేజ్ భవనాల ప్రారంభం



ఎన్టీపీసీ హెరిటేజ్‌భవన్‌ను ప్రారంభిస్తున్న డైరెక్టర్ రవీంద్ర

జ్యోతినగర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ డైరెక్టర్ (ఆపరేషన్స్) రవీంద్రకుమార్ శుక్రవారం రామగుండం ప్రాజెక్టులో పర్యటించారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా శుక్రవారం ఇక్కడికి వచ్చిన డైరెక్టర్ రవీంద్రకు ఆర్‌ఈడీ కేదార్ రంజన్‌పాడు, ఇతర అధికారులు స్వాగతం పలికారు. తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు(టీఎస్‌టీపీపీ)లో నిర్మించిన కోల్‌శక్తి భన్‌ను డైరెక్టర్ ప్రారంభించారు. అనంతరం రామగుండం ఎన్టీపీసీలో ఏర్పాటు చేసిన హెరిటేజ్ భవన్‌ను ఆయన ప్రారంభించారు. తెలంగాణ ఎన్టీపీసీ ప్రాజెక్టు-1వ యూనిట్ కంట్రోల్‌ను డైరెక్టర్ పరిశీలించారు. కొత్తప్రాజెక్టు పనితీరును అడిగి తెలుసుకున్నారు. తరువాత 2600 మెగావాట్ల రామగుండం ప్రాజెక్టు స్టేజ్-1లోని 200 మెగావాట్ల 1వ యూనిట్ కంట్రోల్ రూంను పరిశీలించి సూచనలు చేశారు.

● ఎన్టీపీసీ భవిష్యత్ సారథులు ఈటీలే..

దేశానికి వెలుగులనందిస్తున్న ఎన్టీపీసీకి భవిష్యత్ సారథులు కొత్తగా చేరిన ఎగ్జిక్యూటివ్ ట్రైనీ(ఈటీ)లేనని డైరెక్టర్ రవీంద్ర కుమార్ అన్నారు. తన పర్యటనలో భాగంగా ప్రాజెక్టులో శిక్షణ తీసుకుంటున్న యువ ఈటీలతో డైరెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ రంగంలో ప్రపంచ స్థాయి సంస్థగా గుర్తింపు పొందిన ఎన్టీపీసీని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాలన్నారు. సీనియర్ అధికారుల మార్గదర్శనంలో తమ వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోవాలని సూచించారు. నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అవగాహన చేసుకొని ఎన్టీపీసీలో కొత్త ఆవిష్కరణలు చేయాలని ఈటీలను కోరారు. ప్రాజెక్టులను సమర్థవంతంగా నిర్వహించడానికి అవసరమైన అన్ని అంశాలను నేర్చుకోవాలని డైరెక్టర్ రవీంద్ర కోరారు. అనంతరం డైరెక్టర్ గుర్తింపు యూనియన్, ఇతర యూనియన్ల నాయకులు, అధికారుల సంఘం, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘాలతో సమావేశమయ్యారు. కాగా, శనివారం డైరెక్టర్(ఆపరేషన్స్) 100 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టును సందర్శించనున్నారు. అనంతరం దక్షిణాది రాష్ట్రాల ఎన్టీపీసీ ప్రాజెక్టుల ఆపరేషన్స్ విభాగం అధికారులు, హెచ్‌ఓపీలతో జరిగే సదస్సులో డైరెక్టర్ పాల్గొంటారు. డైరెక్టర్ వెంట ఈడీ(ఆపరేషన్స్) మనోహర్, ఆర్‌ఈడీ కేదార్ రంజన్ పాడు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తల ధర్నా



ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని విఠల్ నగర్‌లోని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట శుక్రవారం అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు ఆందోళనకు దిగారు. రామగుండం ప్రాజెక్టు నుంచి అల్లూరు సెక్టార్ విఠల్‌నగర్4(2) కోడ్ నెంబర్ 113 అంగన్‌వాడీ కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న టీచర్ భాగ్యలక్ష్మి బదిలీపై వెళ్లింది. అదే కేంద్రంలో 13సంవత్సరాలుగా జగదీశ్వరీ హెల్పర్‌గా పనిచేస్తోంది. పదో తరగతి ఉత్తీర్ణత పొందిన జగదీశ్వరీ తనకు టీచర్‌గా అవకాశం కల్పించాలని కోరగా అందుకు నిరాకరించి. మార్కండేయకాలనికి చెందిన హెల్పర్‌కు టీచర్‌గా ఇవ్వటంపై ఆందోళనకు దిగారు. ప్రజావాణిలో కలెక్టర్‌కు జగదీశ్వరీ ఫిర్యాదు చేసింది. అయినా సమస్య పరిష్కారం కాకపోవడంతో సీడీపీఓ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక

జూలపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడుకాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని హరిక్రిష్ణ అనే విద్యార్థి ఉమ్మడి జిల్లా స్థాయిలో అండర్17 విభాగంలో నిర్వహించిన సాఫ్ట్‌బాల్ పోటీలలో రాణించి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పీడీ మహేందర్ తెలిపారు. ఈనెల7,8,9 తేదీలలో ఆర్మూర్‌లో నిర్వహించే పోటీలలో హరిక్రిష్ణ పాల్గొననున్నట్లు తెలిపారు.

వైభవంగా అయ్యప్ప ఆరట్టు ఉత్సవం



రాయికల్‌లో ఉత్సవమూర్తుల శోభాయాత్ర



కోరుట్లలో ఉత్సవమూర్తులను తీసుకొస్తున్న స్వాములు

కోరుట్ల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలో అయ్యప్ప ఆరట్టు ఉత్సవం అంబరాన్నంటిం ది. ఈ సందర్భంగా పట్టణంలో నిర్వహించిన స్వామి వారి రథోత్సవం వైభవంగా సాగింది. అయ్యప్ప స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలను నిర్వహిం చారు. ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలను నిర్వహించి మహదేవ స్వామి దేవాలయానికి భజన కార్యక్రమాలతో తీసుకొచ్చారు. అనంతరం ఆలయ ఆవరణలో ఉన్న కోనేరులో గణపతి, సుబ్రహ్మణ్య, అయ్యప్ప స్వాములకు జలాభిషే కంతో పాటు పంచామృత అభిషేకాలను వేదపండితులు పాలెపు రామకృష్ణ శర్మ, పాలెపు భరద్వాజ్ శర్మ, వినయ్ శర్మ, త్రిపాఠి శర్మ, మంత్రోచ్చారణల మధ్య జరిపారు. ఉత్సవ విగ్రహాలకు అయ్యప్ప స్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించి అలంకరణ నిర్వహించారు. రథోత్సవాన్ని అయ్యప్ప దీక్షాపరులు, భక్తులు, నృత్యాలు చేస్తూ స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప జ్ఞాన సరస్వతి దేవాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, కమిటీ సభ్యులు గట్ల ఆనంద్, క్రాంతి, జుంబర్తి రమేష్, తోట రాజు, సభ్యులు పాల్గొన్నారు.

రాయికల్ : అయ్యప్ప ఆరట్టు ఉత్సవం రాయికల్‌లో శుక్రవారం కన్నుల పండువగా జరిగింది. స్థానిక అయ్యప్ప ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను రథం పై ఉంచి ఆలయం నుంచి శోభాయాత్ర నిర్వహించారు. అయ్యప్ప దీక్షా పరుల నృత్యాలు, శరణుఘోషతో రాయికల్ మారుమోగింది. శోభాయాత్రలో మహిళలు మంగళహారతులతో స్వాములకు స్వాగతం పలికారు. ఉత్సవమూర్తులకు పెద్ద చెరువులో చక్రస్నానం అనంతరం తిరిగి ఆలయానికి తీసుకువెళ్లారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో అయ్యప్ప ఆలయ పూజారి మునుగోటి సత్యనా రాయణశర్మ, సాయి శర్మ, ఆరట్టు ఉత్సవ దాత సత్యనారాయణ, గురుస్వాములు సింగని రమేష్, మచ్చ శ్రీధర్, శ్రవణ్, శ్రీను. అజయ్, సత్యం, శ్రీను, రాజు, సాయికృష్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.


రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ



రాజన్న దర్శనం కోసం క్యూలైన్‌లో భక్తులు

వేములవాడ కల్చరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం భక్తుల రద్దీ నెలకొంది. గురువారం రాత్రి రాజన్న క్షేత్రానికి చేరుకున్న భక్తులు ఉదయం కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించి ఆలయ ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించారు. అనం తరం క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరుకున్న భక్తులు పార్వతిపరమేశ్వరులను దర్శించుకున్నారు. రాజన్నకు అత్యంత ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. అనుబంధ ఆలయాల్లో కుంకుమ పూజల్లో పాల్గొన్నారు.

ధర్మపురి గోదావరి వద్ద మల్లన్న భక్తులు..



గోదావరి నది వద్ద స్నానాలు ఆచరిస్తున్న మల్లన్న భక్తులు

ధర్మపురి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి గోదావరి నది వద్ద శుక్రవారం మల్లన్న భక్తుల రద్దీ పెరిగింది. సట్టి వారోత్సవాలను పురస్కరించుకుని భారీగా భ క్తులు తరలి వచ్చి గోదావరిలో స్నానాలు చేశారు. నదీ జలాలతో విగ్రహాలను శుభ్రం చేసి పూజించారు. ఇక్కడి నుంచి తమ గ్రామాల్లో మల్లన్న పట్నాలు వేసుకు నేందుకు తిరుగు ప్రయాణం అయ్యారు. పట్నాలు వేసిన మరునాడు వేములవాడ, కొమరవెల్లి, ఓదేల, ఐనవోలు ఆలయాలకు వెళ్లడం ఆనవాయితీగా వస్తున్నది.

ప్రత్యేక తరగతులు... లక్ష్యం వైపు పరుగులు

- పుస్తకాలతో కుస్తీ పడుతున్న పదోతరగతి విద్యార్థులు
- వందశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి

హుజూరాబాద్‌రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించేందుకు విద్యార్థులు సన్నద్ధం అవుతున్నారు. ప్రభుత్వ పాఠశాల్లో ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ లక్ష్యం వైపు విద్యార్థులను సిద్ధం చేస్తున్నారు. మెరుగైన ఫలితాలు రాబట్టాలని ఉపాధ్యాయులు విద్యార్థులతో సాధన చేయిస్తున్నారు. వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళిక సిద్ధంచేసి పాఠ్యాంశాల వారీగా అమలు చేస్తున్నారు.

● సందేహాలను నివృత్తి చేస్తూ ..

పదో తరగతి పరీక్షలు సమీపంలో ఉండటంతో ఆయా పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు ప్రారంభమయ్యాయి. ఉదయం, సాయంత్రం ఒక్కో సబ్జెక్ట్ టీచర్లు విద్యార్థులను గ్రూపుల వారీగా విభజించి పాఠ్యాంశాలను పునఃశ్చరణ చేయిస్తున్నారు. గతంలో నిర్వహించిన వార్షిక పరీక్షల ఆధా రంగా పాత ప్రశ్నపత్రాలతో పరీక్షలు నిర్వహిస్తూ సమగ్ర మూల్యాంకనం చేస్తున్నారు. చదువుతున్న వేళ వారికి వస్తున్న సందేహాలను నివృత్తి చేస్తున్నారు. ముఖ్యంగా వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఏ సబ్జెక్టులో వెనుకబడి ఉన్నారో గుర్తిస్తూ.. ఆయా విభాగాల ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తూ ఉత్తీర్ణతశాతం పెంచడమే లక్ష్యంగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

● అల్పాహారం కోసం విద్యార్థుల ఎదురుచూపులు

ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతుల నిర్వహణ కొనసాగుతోంది. ఉదయం విద్యార్థులు హడావిడిగా ఏమీ తినకుండా వస్తున్నారు. మధ్యాహ్న భోజనంతో ఆకలి తీర్చుకుంటున్నారు. సాయంత్రం అల్పాహారం దొరకకపోవడంతో ప్రత్యేక తరగతుల వేళ విద్యార్థులు అలమటిస్తున్నారు. దాతలు ఎవరైనా స్పందించి విద్యార్థుల సౌలభ్యం కోసం అల్పాహారం ఏర్పాటు చేయాలని ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు కోరుతున్నారు.



చెల్పూర్ జడ్పీహెచ్‌ఎస్‌లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు

ప్రధాన పరీక్షల భయం తొలగింది



ఆంగ్లం, గణితం, సామాన్యశాస్త్రం అంటే భయం ఉండేది. ప్రత్యేక తరగతుల వల్ల భయం తొలిగిపోయింది. ఉపాధ్యాయులు మా సందేహాలను చక్కగా నివృత్తి చేస్తున్నారు. ఆంగ్లంలో వ్యాకరణం, సామాన్యశాస్త్రంలో చిత్రపటాలు, గణితంలో సూత్రాలపై పట్టు సాధించి వార్షిక పరీక్షల నాటికి పూర్తిగా సన్నద్ధమవుతాం. మంచి గ్రేడ్లు సాధిస్తాం.

- మౌనిక, పదో తరగతి విద్యార్థి, సిర్సపల్లి

గ్రూపులుగా విభజించి చెబుతున్నారు



ఆయా పాఠ్యాంశాల్లో మా ప్రతిభను గుర్తించి గ్రూపులుగా బోధన చేస్తున్నారు. సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులు రాణించేలా ఒకటికి రెండుసార్లు బోధన చేస్తున్నారు. స్లిప్ టెస్టుల ఆధారంగా విద్యార్థుల ప్రతిభను గుర్తించి గ్రూపులుగా విభజించి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నోట్స్ అందజేస్తున్నారు.

-సూత్రాల హర్షిత్, పదో తరగతి విద్యార్థి, జడ్పీహెచ్‌ఎస్ చెల్పూర్

ఉత్తమ ఫలితాలు సాధించేందుకు



విద్యార్థులకు పదో తరగతి ఎంతో కీలకం. ఇక్కడ నుంచి గ్రేడ్లు సాధిస్తేనే భవిష్యత్తులో ఉపయోగపడుతాయి. అందుకు పక్కా ప్రణాళిక రచించుకొని ముందుకు సాగుతున్నాం. గతంలో మాదిరిగా వందశాతం ఫలితాలు రావడంతో పాటు 10 జీపీఏ సాధించే దిశగా సన్నద్ధం చేస్తున్నాం. సంబంధిత ఉపాధ్యాయుల ద్వారా విద్యార్థులు వారి సందేహాలను నివృత్తి చేసుకుంటున్నారు. ఉత్తమ గ్రేడు సాధించేలా విద్యార్థులను ప్రోత్సాహిస్తున్నాం.

- అనురాధ, హెచ్‌ఎం, చెల్పూర్

నియామకం

గొల్లపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : గొల్లపల్లి మండలం అబ్బాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ యువనాయకులు పురంశెట్టి గౌతమ్ రాజు యువజన కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడుగా ఎన్నికయ్యారు. ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఓటింగ్ ద్వారా గౌతమ్ రాజుకు 90 శాతానికి పైగా ఓట్లు రావడంతో యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రకటించారు. ఈ మేరకు గౌతమ్ రాజుకు నియామక పత్రాలను లక్ష్మణ్ కుమార్ అందించారు.

ఘనంగా మల్లికార్జున స్వామి కల్యాణం

గొల్లపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : గొల్లపల్లి మండలం మల్లన్న పేట మల్లికార్జున స్వామి జాతర ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. జాతర ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు స్వామివారి కల్యాణం కన్నుల పండువలా నిర్వహించారు. ఆలయ పూజారులు శాంతయ్య, రాజేందర్, రఘు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఏఎంసీ చైర్మన్ భీమ సంతోష్, ఆలయ ఫౌండర్ ట్రస్టీ కొండూరి శాంతయ్య, తాజామాజీ ప్రజా ప్రతినిధులు సిద్దంకి నర్సయ్య, పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా సంజీవ్

మల్యాల, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) : ఎమ్మార్పీఎస్ మల్యాల మండల అధ్యక్షుడిగా నలువాల సంజీవ్‌ను శుక్రవారం ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా మెతుకు నర్సయ్య, అధికార ప్రతినిధిగా కట్కూరి దిలీప్, ప్రధాన కార్యదర్శిగా గుడిసె రవి, ప్రధాన కార్యదర్శిగా కార్యదర్శిగా ముప్పారపు రవి, సంయుక్త కార్యదర్శులుగా గంగాధర చిన్నగంగమల్లు, వినోద్‌ను ఎన్నుకున్నారు.

ఓటర్ ఐడీ కార్డులు పంపిణీ

కథలాపూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పోసానిపేటలో శుక్రవారం తహసీల్దార్ వినోద్ ఓటర్ ఐడీ కార్డులు పంపిణీ చేశారు. ఇటీవల స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా కొత్తగా ఓటరు నమోదు, పాత కార్డు కలిగి ఉన్న వారిని కలర్ ఫొటోలతో కార్డులు అందించాలని నిర్ణయించారు. ఈ మేరకు ఓటర్లకు ఐడీ కార్డులు అందజేశారు.



జగిత్యాలలో నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత



రాయికల్‌లో..



నివాళులు అర్పిస్తున్న కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్



ధర్మపురి పట్టణంలో..

ఘనంగా అంబేద్కర్ వర్ధంతి

జిల్లా వ్యాప్తంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు, నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో అంబేద్కర్ చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రతి ఒక్కరూ అంబేద్కర్ అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు.

-ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్



నివాళులర్పిస్తున్న దళిత సంఘాల నాయకులు



కోరుట్లలో నివాళులు అర్పిస్తున్న మున్సిపల్ పాలకవర్గ సభ్యులు, అధికారులు



వెల్లుల్లలో అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

మనోభావాలను దెబ్బతీయడం సమంజసం కాదు

జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్

జగిత్యాల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వెలమ సామాజిక వర్గ మనోభావాలను దెబ్బతీసేలా షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వ్యాఖ్యానించడం సమంజసం కాదని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్ అన్నారు. శుక్రవారం రాత్రి స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. అసభ్య పదజాలంతో దూషిస్తూ, బెదిరింపులకు పాల్పడిన షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తీరును తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. ఎమ్మెల్యే శంకర్ ప్రయోగించిన పదాలు, వాడిన భాషా వల్ల వెలమ సామాజిక వర్గం మనోభావాలు దెబ్బతినడం జరిగిందన్నారు.

అహంకార పూరితంగా ఒక సామాజిక వర్గంపై దూషనలు చేయడం, బెదిరింపులకు పాల్పడడం ఎంతవరకు సమం జసమన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరముందన్నారు.

రెండో పెళ్లి చేసుకున్న భర్తకు ఏడాది జైలు శిక్ష

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాజేశ్వర్‌రావుపేట గ్రామానికి చెందిన కోట నరేందర్(30) అనే యువకుడు మొదటి భార్య లావణ్యకు విడాకులు ఇవ్వాకుండ రెండవ పెళ్లి చేసుకున్న కేసులో నరేందర్‌కు ఏడాది జైలు శిక్షతో పాటు 2 వేల రూపాయలు జరిమానా విధించినట్లు ఇబ్రహీంపట్నం ఎస్‌ఐ అనిల్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం నరేంధర్ 2011లో లావణ్యను పెళ్లి చేసుకున్నాడు. తరచు దంపతులకు గొడవలు జరుగడంతో విడివిడిగా ఉంటు మొదటి భార్య లావణ్యకు విడాకులు ఇవ్వకుండా రెండో పెళ్లి చేసుకున్నాడని 2018లో లావణ్య ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన ఇబ్రహీంపట్నం పోలీసులు కోర్టులో సాక్ష్యులను హాజరు పరుచగా జడ్జీ అరుణ్ కుమార్ నిందితుడికి ఏడాది జైలు శిక్షతో పాటు 2 వేల జరిమానా విధించారు. నేరస్తుడికి శిక్ష పడేల కృషి చేసిన ఎస్‌ఐ అనిల్‌ను, కోర్టు కానిస్టేబుల్ రాజేంధర్‌లను మెట్‌పల్లి డీఎస్పీ రాములు అభినందించారు.

ఆదర్శ రైతుల వ్యవస్థ పునరుద్ధరణకు కసరత్తులు

(5వ పేజీ తరువాయి)

తీసుకోవడమే కాకుండా క్షేత్రస్థాయిలో పర్యటించడం, ధాన్యం సేకరణలో సాయం అందించడం కర్షకులకు సలహాలు, సూచనలు ఇవ్వడం తదితర విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. ఇటీవల డిజిటల్ సర్వే ప్రక్రియను సైతం అప్పగించారు. దీనికి ఏఈవోలు ససేమిరా అంటూ ఆందోళనకు దిగారు. ప్రస్తుతం ఆదర్శ రైతులను నియమించనుండటంతో వారికి కొంత ఉపశమనం కలుగనుంది.

●గతంలో ఇలా...

2007లో పదో తరగతి ఉత్తీర్ణులై సాగుపై అనుభవం ఉన్న యువకులను గుర్తించి ఆదర్శ రైతులుగా నియమించారు. అప్పట్లో సుమారు 200 నుంచి 250 ఎకరాల వరకు వీరికి బాధ్యత అప్పగించారు. 20 రకాల కార్యకలాపాలు నిర్వర్తించేలా నిర్దేశించారు. గౌరవ వేతనంగా ప్రతి నెలా రూ. వెయ్యి చొప్పున అందజేశారు. ప్రతి ప్రభుత్వ కార్యక్రమంలోనూ వీరిని భాగస్వామ్యం చేశారు. అప్పట్లో మండలాల్లో వ్యవసాయ విస్తరణ అధికారుల కొరత ఉండటంతో రైతులకు వీరి సేవలు బాగా ఉపయోగపడ్డాయి. అయితే వివిధ కారణాలతో ఈ వ్యవస్థను ప్రభుత్వం 2017లో రద్దు చేసింది. ఆదర్శ రైతులకు రూ. 3 వేల గౌరవ వేతనం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.

పునరుద్ధరణ ఆలోచన సంతోషకరం

వాకిటి సత్యనారాయణ రెడ్డి, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు



రాష్ట్రంలో గతంలో రద్దయిన ఆదర్శ రైతు వ్యవస్థ పునరుద్ధరణ ఆలోచన సంతోషకరం. ఆదర్శ రైతు వ్యవస్థ వల్ల బహుళ ప్రయోజనాలు అందుతాయి. వ్యవసాయ రంగం అభివృద్ధి గణనీయంగా పెరిగే అవకాశాలున్నాయి. యువతతో పాటు సమాజంలోని అన్ని వర్గాలు వ్యవసాయంపై మరోమారు దృష్టి సారిస్తారు. రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు వేగవంతంగా అందుతాయి. వ్యవసాయ అధికారులపై పనిభారం సైతం తగ్గనుంది.

ఎలాంటి మార్గదర్శకాలు రాలేదు

రాంచందర్, జిల్లా ఇన్‌చార్జి వ్యవసాయ శాఖ అధికారి, జగిత్యాల



ఆదర్శ రైతుల నియామక ప్రక్రియకు సంబంధించి వ్యవసాయ రంగంలో వివిధ చర్చలు చోటుచేసుకుంటున్నాయి. ఆదర్శ రైతు నియామకంలో ప్రభుత్వం కసరత్తులు చేస్తున్నట్లు తెలుస్తోంది. త్వరలో విధి విధానాలు రూపొందించనున్నారు. ఇప్పటి వరకు వ్యవసాయ శాఖకు ఎలాంటి మార్గదర్శకాలు రాలేదు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాగానే ఇందుకు సంబంధించిన ప్రక్రియ మొదలు పెడతాం. ఈ వ్యవస్థ పునరుద్ధరణతో పనిభారం తగ్గి కొంత ఉపశమనం కలుగనుంది.

జగిత్యాలలో కేక్‌లు సీజ్

జగిత్యాల అర్బన్, డిసెంబర్ 6 (ఆంధ్రజ్యోతి) జగిత్యాల జిల్లా కేంద్రంలోని కరీంనగర్ డెయిరీలో ఫంగస్ వచ్చిన కేక్‌లను ఫుడ్ ఇన్స్‌పెక్టర్ అనూష శుక్రవారం సీజ్ చేశారు. వివరాల ప్రకారం జిల్లా కేద్రానికి చెందిన ఓ వినియోగదారుడు బుధవారం కరీంనగర్ డెయిరీలో కేక్ కొనుగోలు చేశాడు. ఇంటికి వెళ్లి చూడగా కేకుల్లో ఫంగస్ ఉన్నట్టు గుర్తించి నిర్వాహకులకు విషయం తెలిపాడు. వారు నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడంతో బాధితుడు ఫుడ్ ఇన్స్‌పెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. ఫుడ్‌ఇన్స్‌పెక్టర్ దాడులు నిర్వహించగా కేకుల్లో ఫంగస్ ఉన్నట్టు గుర్తించి కేక్‌లను సీజ్ చేశారు. జగిత్యాలలో ఉన్న కరీంనగర్ మిల్క్ డెయిరీకి చెందిన ఎనమిది పాయింట్లలో ఈ బ్యాచ్ మిల్క్ కేకులను విక్రయించరాదని ఆమె హెచ్చరించారు.

యాదవులకు బీమా అమలు చేయాలి

-యాదవ మహా సభ జిల్లా అధ్యక్షుడు మల్లేష్ యాదవ్

వెల్గటూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): యాదవులకు బెడ్ పాలక్ బీమా అమలు చేయాలని, గొర్రెలకు బీమా పథకం అమలు చేయాలని యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు మల్లేష్ యాదవ్ డిమాండ్ చేశారు. అఖిల భారత యాదవ మహాసభ వెల్గటూర్ మండల అధ్యక్షుడు మాచర్ల రాజేందర్ అధ్యక్షతన కోటిలింగాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గోకుల్ ట్రస్ట్ ద్వారనే యాదవ సంఘం కమిటీలను ఏర్పాటు చేసి సభ్యత్వ నమోదు చేపడుతామని తెలిపారు. యాదవ సంఘం నాయకుల పేరుతో కొంత మంది కుల విచ్చిన్నం చేసి లబ్ధి పొందే ప్రయత్నం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. యాదవ కులం మధ్య విభేదాలు సృష్టించడానికి ప్రయత్నం చేసే వారి చర్యలను అఖిల భారత యాదవ మహాసభ తరుపున ఖండిస్తున్నామన్నారు. కరీంనగర్ నుంచి జగిత్యాల జిల్లా విభజన జరిగిన నేపథ్యంలో జగిత్యాలలో గొర్రెల కాపరుల సహకార యూనియన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గొర్రెల మేకల మార్కెట్ యార్డులను ప్రతి నియోజకవర్గానికి ఒకటి ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ముక్కెర కుమార్ యాదవ్, కుమార స్వామి, మాచర్ల రాజేందర్, ఎలుక రాజు యాదవ్, నక్క లక్ష్మన్ యాదవ్, యాగండ్ల గంగన్న గోపు పోచయ్య, రాపాక మహేందర్ ఉన్నారు.



మాట్లాడుతున్న అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు మల్లేష్ యాదవ్

విద్యార్థుల ఎదుగుదలలో తల్లిదండ్రుల పాత్రే కీలకం

గొల్లపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రతి విద్యార్థి ఎదుగుదలలో తల్లిదండ్రుల పాత్రే ఎంతో కీలకమైనదని ప్రిన్సిపాల్ ఏనుగు మల్లయ్య పేర్కొన్నారు. శుక్రవారం గొల్లపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ అధ్యక్షతన తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఇంటర్ బోర్డు విద్య కమీషనర్ ఆదేశాల మేరకు కళాశాలల్లో 90 రోజుల ప్రణాళికను అమలు చేస్తున్నామని, దీనికి ప్రతి తల్లిదండ్రులు సహకరించాలన్నారు. విద్యార్థులను క్రమం తప్పకుండా ప్రతిరోజు కళాశాలకు పంపించాలని, ఇంటిదగ్గర చదువుకునే వాతావరణంను, వసతులను కల్పించాలని కోరారు.

సెల్‌ఫోన్‌లకు, టీవీలకు, సోషల్ మీడియాకు విద్యార్థులను దూరంగా ఉంచాలని సూచించారు. రానున్న వార్షిక పరీక్షల దృష్ట్యా మూడు నెలలు వ్యవసాయ పనులు, ఇతర పనులకు విద్యార్థులను పురమాయించరాదని తల్లిదండ్రులకు సూచించారు. విద్యార్థుల హాజరుపై సమీక్షించుకోవాలన్నారు. ఈ సమావేశంలో లెక్చరర్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆటో బంద్‌ను విజయవంతం చేయాలి

ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు

కోరుట్ల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 7న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఆటో బందును విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయ సమీపంలో ఆటో యూనియన్ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి సంబధింత కరపత్రంను ఆవిష్కరించారు. ఈ సందర్బంగా మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆటో ట్యాక్సీ డ్రైవర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హమీలు అమలు చేయాలని రాష్ట్ర వ్యాప్త ఇచ్చిన బందు పిలుపును జయప్రదం చేయాలని కొరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు మౌలాన, ముక్రంలతో పాటు ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

'కంప్యూటర్ పరిజ్ఞానం అవసరం'

మెట్‌పల్లి రూరల్, డిసెంబర్, 6 (ఆంధ్రజ్యోతి) : కంప్యూటర్ పరిజ్ఞానం ప్రతి ఒక్కరికీ ఎంతో అవసరమని మెట్‌పల్లి తహసీల్దార్ శ్రీనివాస్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం మెట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఒకేషనల్ విభాగంలోని ఆఫీస్ అసిస్టెంట్ షిప్ విద్యార్థులకు ఆన్‌లైన్ జాబ్ ట్రైనింగ్‌లో భాగంగా తహసీల్దార్ కార్యాలయంలో అవగాహన సదస్సు కల్పించారు. కార్యాలయంలో అధికారులు ఆన్‌లైన్‌లో చేపట్టుతున్న భాగాలు, నిర్వహిస్తున్న విధుల పట్ల తహసీల్దార్‌తో పాటు సిబ్బంది విద్యార్థులకు వివరించారు. అధికారులు, అధ్యాపక బృందం, విద్యార్థులు, పాల్గొన్నారు.

కాంగ్రెస్ యువజన ఫలితాల్లో సత్తా

మల్యాల, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌పార్టీ యువజన ఫలితాల్లో మల్యాల మండలనాయకులు సత్తా చాటారని వెల్మ కృష్ణారెడ్డి అన్నారు. మల్యాల మండల కేంద్రంలోని మహాలక్ష్మీ ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఇటీవల కాంగ్రెస్‌పార్టీ యువజన విభాగానికి సంబంధించి ఓటింగ్ ప్రాతిపదికన నిర్వహించిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ యువజన జిల్లా అధ్యక్షులుగా ముత్యంపేట గ్రామానికి చెందిన ముత్యంశంకర్, చొప్పదండి నియోజకవర్గం పార్టీ ఉపాధ్యక్షుడిగా రామన్నపేట గ్రామానికి చెందిన వెల్మ కృష్ణారెడ్డి, చొప్పదండి నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ యువజన ప్రధాన కార్యదర్శిగా తాటిపల్లి గ్రామానికిచెందిన శ్రీకోటి శ్రీకాంత్, మల్యాల మండల యూత్ అధ్యక్షుడిగా మల్యాలకు చెందిన శనిగారపు తిరుపతి, ఉపాధ్యక్షుడిగా నాగుల సంజీవ్‌గౌడ్ గెలుపొందడంతో మల్యాల కాంగ్రెస్‌పార్టీలో ఉత్సాహం నెలకొందని పేర్కొన్నారు.

అంజన్నను దర్శించుకున్న బీసీ వెల్ఫేర్ కమిషనర్

మల్యాల, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): బీసీ వెల్ఫేర్ కమిషనర్ బూసాని వెంకటేశ్వర్లు శుక్రవారం కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వదించగా అధికారులు శేషవస్త్రాలతో సత్కరించారు. ఆయన వెంట ఆలయ అధికారులతో పాటు రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

'కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల అభివృద్ధి'

కోరుట్ల రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల అభివృద్ధి సాధ్యమని ప్రజాపాలన విజయోత్సవ కోరుట్ల నియోజకవర్గ కో ఆర్డినేటర్ బాస వేణుగోపాల్ యాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని అయిలాపూర్ గ్రామంలో మార్కెట్ కమిటి చైర్మెన్ పన్నాల అంజిరెడ్డి ఆధ్వర్యంలో ప్రజాపాలన విజయోత్సవ కార్యక్రమానికి హజరైన వేణుగోపాల్ యాదవ్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఏడాదిలోనే 55 వేల ప్రభుత్వ ఉద్యోగ నియమకాలు, 25 లక్షల మంది రైతు కుటుంబాలకు రూ. 21 వేల కోట్ల మేరకు రుణ మాఫీ జరిగిందని తెలిపారు. సీఎంతో పాటు రాష్ట్ర మంత్రుల చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మెన్ సాయిరెడ్డి, మల్లాపూర్, ఇబ్రహీపట్నం మార్కెట్ కమిటి చైర్మెన్‌లు అంతడుపుల పుష్పలత - నర్సయ్య, బోరిగం రాజు పాల్గొన్నారు.

డాటా ఎంట్రీ పకడ్బందీగా నిర్వహించాలి

కలెక్టర్ సత్యప్రసాద్

రాయికల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): డాటా ఎంట్రీ పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సత్యప్ర సా ద్ అన్నారు. రాయికల్ మండల పరిషత్ కార్యాలయం లో సమగ్ర కుటుంబ సర్వే డాటా ఎంట్రీని శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వార్డుల వారిగా పకడ్బందీగా ఆన్‌లైన్‌లో తప్పులు లేకుండా నమోదు చేయాలన్నారు. వార్డులలో ఉండవలసిన డాటా కంటే ఎక్కువ మంది నమోదైతే జాబితాను యథావిధిగా వార్డు వారిగా సరి చేసి పూర్తి చేయాలన్నారు. వీరివెంట తహసీల్దార్ ఖయ్యూం, ఎంపీడీవో చిరంజీవి, ఎంపీవో సుష్మ, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

మెట్‌పల్లి రూరల్ : డేటా ఆపరేటర్లు తప్పులు లేకుండా వార్డుల వారీగా ఆన్‌లైన్‌లో పకడ్బందీగా కుటుంబ వివరాలను నమోదు చేయాలని కలెక్టర్ సత్యప్రసాద్ సూచించారు. శుక్రవారం మెట్‌పల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో కొనసాగుతున్న కుటుంబ సమగ్ర సర్వే డేటా ఎంట్రీ ప్రక్రియను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆపరేటర్లు చేస్తున్న డేటా ఎంట్రీ ప్రక్రియ, పలు గ్రామాల్లోని వార్డుల్లో జీరో నమోదులను పరిశీలించి, జరిగిన తప్పులను సరిచేసి ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయించాలని ఆపరేటర్లు, ఇన్‌చార్జి ఎంపీడీవోకు పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎన్యుమరేటర్‌లు సేకరించిన సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్యా ఉపాధి, కులగణన, సమగ్ర సర్వేలో ఎలాంటి తప్పులు ఉన్నయో సునిశితంగా పరిశీలించాలన్నారు. గ్రామాల్లోని వార్డుల్లో జీరో నమోదు అయిన వాటి వివరాలను ఎన్యుమరేటర్‌ను, గ్రామా ల్లోని పంచాయతీ సిబ్బంది నుంచి వివరాలు సేకరించి సరిచేయాలన్నారు. డేటా ఆపరేటర్లు తప్పులు లేకుండా ఎంట్రీ చేయాలని సూచించారు. డేటా ఎంట్రీ చేసేట వ్పుడు ఎన్యుమరేటర్ తప్పని సరిగా దగ్గర ఉండి నమోదు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీవో మహేశ్వర్‌రెడ్డి, ఏపీవో తిరుపతిరావు, ఆర్‌ఐ ఉమేష్, కార్యదర్శులు, కారో బార్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మల్లాపూర్ : సమగ్ర కుటుంబ సర్వే డేటాను ఆన్‌లైన్‌లో తప్పులు లేకుండా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశించారు. శుక్రవారం మల్లాపూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరుగుతున్న సమగ్ర ఇంటింటి సర్వే డాటా ఎంట్రీని మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

వార్డుల వారిగా పకడ్బందిగా తప్పులు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. వార్డుల వారిగా సరి చేసి నేడే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వెంటా తహసీల్దార్ వీర్‌సింగ్, ఎంపీడీవో జగదీష్, అధికారులు, సిబ్బంది, ఉన్నారు.



మెట్‌పల్లి ఎంపీడీవో కార్యాలయంలో డాటా ఎంట్రీని పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

సీఎం కప్ పోటీలు విజయవంతం చేయాలి

కోరుట్ల రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : సీఎం కప్ ఆటల పోటీలను విజయవంతం చేయాలని ఎంపీడీవో రామకృష్ణ, మండల విద్యాధికారి నరేశం అన్నారు. శుక్రవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మండలంలోని వివిధ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులతో ఆటల పోటీల నిర్వహనపై సన్నహక సమావేశం నిర్వహించి పలు సూచనలు సలహాలను అందిచారు. వాలిబాల్, కబడీ, ఖోఖో, అథ్లెటిక్స్‌లలో పాల్గొనే విద్యార్థుల, యువకుల వివరాలను స్పోర్ట్ వెబ్‌సైడ్‌లో నమోదు చేయాలని సూచించారు. ఈ నెల 10,11,12 తేదీలలో మండల స్థాయి ఆటల పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పంచాయితీ సెక్రటరీ క్రీడోత్సవాలపై గ్రామగ్రామ ప్రచారం నిర్వహించి క్రీడలు విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల మున్సిపల్ సానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆశోక్‌లతో పాటు వివిధ గ్రామాల పాఠశాల పీఈటీలు, కార్యధర్శులు పాల్గొన్నారు.

మృతికి కారణమైన వ్యక్తికి ఏడాది జైలు

కొడిమ్యాల, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) : ఒకరి మృతికి కారణమైన వ్యక్తికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ రెండవ అదనపు ఫస్ట్ క్లాస్ జ్యూడీషియల్ మెజిస్ట్రేట్ తీర్పు చెప్పినట్లు కొడిమ్యాల ఎస్సై సందీప్ శుక్రవారం సాయంత్రం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు పూడూర్ గ్రామానికి చెందిన తొట్టి గంగయ్య 2018 మార్చి 2న సైకిల్ పై వెల్లుతుండగా భువనగిరి జిల్లాకు చెందిన కందాడి నరెందర్‌రెడ్డి కారుతో గంగయ్యను వెనుక నుంచి ఢీకొట్టాడు. దీంతో అతను తీవ్ర గాయాలపాలయ్యాడు. ఆసుపత్రిలో చికిత్స పొంది 2018 మార్చి 7న ఇంటికి చేరుకుని మందులు వాడుతున్నాడు. 2018 మే 17న మృతి చెందాడు. అప్పటి ఎస్సై సతీష్‌కుమార్ సాక్షులు తరుపున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం. రజని వాధించగా రెండవ అదనపు ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ జె. వినీల్‌కుమార్ కారు డ్రైవర్ నరేందర్‌రెడ్డికి ఏడాది జైలు శిక్ష, 2వేల రూపాయల జరిమానతో పాటు మృతుని కుటుంబానికి 50 వేల రూపాయల నష్టపరిహారం చెల్లించాలంటూ తీర్పు చెప్పినట్లు ఎస్సై వివరించారు. సాక్షులను ఎస్సై ఎస్. సందీప్, కోర్టు కానిస్టేబుల్ బి. కళ్యాణ్ ప్రవేశ పెట్టారు.

మెగా జాబ్ మేళాను వినియోగించుకోవాలి

వెల్గటూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతీ, యువకుల కోసం జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆధ్వర్యంలో జగిత్యాల పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఈ నెల 11న నిర్వహించే మెగా జాబ్ మేళాను వినియోగించుకోవాలని ఎస్సై ఉమా సాగర్ కోరారు. ఈ జాబ్ మేళాలో 50 కి పైగా కంపెనీలు పదవ తరగతి నుంచి ఎంటెక్ విద్యార్హత కలిగిన వారికి కూడా ఉద్యోగాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. పదవ తరగతి ఫెయిల్ అయిన వారికి కూడా తగిన ఉద్యోగాలు కల్పించబడతాయన్నారు. మండలంలోని యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సంక్షిప్త సమాచారం

జగిత్యాల: జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలలో పాల్గొనడానికి ఎంపిక పట్టణంలోని హౌజింగ్ బోర్డు కాలనీకి చెందిన క్రీడాకారిణి వొరుగొండ హేమ హసినిని శుక్రవారం మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి ప్రవీణ్ ఘనంగా సన్మానించారు.

కథలాపూర్ : మండల ఎన్ఎస్‌యుఐ అధ్యక్షుడిగా కలికోటకు చెందిన అంబటి రాధాకృష్ణ ఎన్నికయ్యాడు. ఇటీవల ఆన్‌లైన్‌లో ఎన్నికలు నిర్వహించగా శుక్రవారం ఫలితాలు వెలువడ్డాయి. రాధాకృష్ణకు అత్యధికంగా 710 ఓట్లు రావడంతో గెలుపొందినట్టు ఎన్నికల అధికారులు ప్రకటించారు.

●మండలంలోని పోతారంలో శుక్రవారం ఇటీవల వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్‌పర్సన్‌గా నియమితులైన పులి శిరీషహరిప్రసాద్‌ను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు సన్మానించారు.

గొల్లపల్లి: గొల్లపల్లి మండలంలోని మల్లన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆశ్రీ సొసైటి ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా 150 మంది విద్యార్థులకు నోట్‌బుక్‌లు, పరీక్ష ప్యాడ్‌లు, శుక్రవారం దాతలు అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జమునాదేవి, సామాజిక సేవకులు, ప్రముఖ పిల్లల వైద్యులు డా. ఎల్లాల శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధర్మపురి: ధర్మపురి పట్టణంలోని 10, 11వ వార్డుల్లో ప్రజా పనుల విజయోత్సవాల్లో భాగంగా ప్రత్యేక పారిశుధ్య పనులు శుక్రవారం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ, కమీషనర్ శ్రీనివాస్, వైస్‌చైర్మన్ ఇందారపు రామయ్య, పాల్గొన్నారు.

సారంగాపూర్ : మండలంలోని అర్పపల్లి బ్రాంచ్ పోస్టుమాస్టర్ ఎండబెట్ల మాణిక్యం శుక్రవారం పదవి విరమణ చేశారు. సబ్ పోస్టుమాస్టర్ బ్రహ్మాచారి, మాజీ వైస్ ఎంపీపీ సురేందర్, ఉద్యోగులు పాల్గొన్నారు.

వెల్గటూర్: వెల్గటూర్ చెందిన ఇద్దరు బండారి సాహితి, సిరిపురం స్వాతిక అనే యువతులు ఇటీవల ప్రభుత్వ ఉద్యోగాలు సాధించగా గురువారం కాంగ్రెస్ నాయకులు వారికి శాలువా కప్పి ఘన సన్మానం చేశారు. ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశాల మేరకు వెల్గటూర్ కాంగ్రెస్ నాయకులు సన్మాన కార్యక్రమం నిర్వహించి నట్లు తెలిపారు.

కొడిమ్యాల: అడవులను కాపాడుకోవటం మనందరి బాధ్యత అని కొడిమ్యాల డిప్యూటీ రేంజర్ ముషారఫ్ అన్నారు.

శుక్రవారం మండలంలోని కొండాపూర్ అనుబంధ గ్రామమైన బొల్లొనిచెరువు గ్రామంలోని ప్రజలకు అడవులను కాపాడుకో వటంపై అవగాహన కలిపిం చారు.